క్లుప్తంగా

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యర్రగొండపాలెం: పునర్వ్యవస్థీకరణ వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు ప్రయోజనం పొందాలని వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ ఈవీ రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని బోయలపల్లి సచివాలయంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వాటి విపత్తుల నుంచి వచ్చే నష్టాలపై ఆర్థిక రక్షణ కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పత్తి పంటకు రైతులు రూ.2100 ప్రీమియం చెల్లిస్తే విపత్తుల కారణంగా నష్టపోయిన రైతుకు రూ.42 వేల వరకు చెల్లిస్తారని పేర్కొన్నారు. సదస్సులో ఏవో నీరజ, వ్యవసాయ బీమా కంపెనీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బలరామస్వామి పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ సమావేశాలు విజయవంతం చేయాలి

తాళ్లూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సమావేశాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి-1 జి.సుబ్బయ్య, ఎంఈఓ-2 సుధాకర్‌రావు కోరారు. స్థానిక ఎంఆర్సీలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ప్రత్యేక ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ కొనసాగించాలని సూచించారు. సమయం ప్రకారం విద్యార్థులకు హాజరు నమోదు చెయ్యాలని, హాజరు తగ్గితే విద్యార్థులు తల్లికి వందనం అర్హత పొందరని, ఈ విషయాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులకు తెలియజేయాలని కోరారు.

భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

తాళ్లూరు: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి తహసీల్దార్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ పట్టాదార్‌పాస్ పుస్తకాలు, నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే కార్డులు వచ్చేలా చూడాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. వీఆర్‌ఓలు, ఏఎస్‌ఓలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

వాల్టా..ఉల్టా!



పుల్లలచెరువులో బహిరంగ ప్రదేశంలో నరికిన చెట్టు

- ఇష్టానుసారం చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు

పుల్లలచెరువు: మానవాళి మనుగడకు ప్రాణాధారమైన చెట్లను గ్రామాలు, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టానుసారం నరికేస్తున్నారు. భూమి, నీరు, చెట్లను సంరక్షించేందుకు ఏర్పాటు చేసిన వాల్టా చట్టం నేడు ఆక్రమణదారుల చేతుల్లో చుట్టంలా మారింది. కనబడిన చోటల్లా ఉన్న చెట్లను నరుకుతూ అడ్డుదారుల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుని జేబులు నింపుకుంటున్నారు. గ్రామాల్లోని పొలం గట్లపై, ఖాళీ ప్రదేశాల్లో ఉన్న చెట్లను అక్రమంగా అనుమతులు లేకుండా నరికేస్తున్నారు. కలపను ఇటుక బట్టీలకు, బొగ్గుల బట్టీలకు తరలిస్తున్నారు. ఎక్కువ ధరలు ఉండటంతో గ్రామాల్లోని కొందరు చెట్లను నరకడమే పనిగా పెట్టుకుని సొమ్ము చేసుకుంటున్నారు. రైతులు కూడా తమ పొలాల్లోని పెద్ద పెద్ద చెట్లను డబ్బుకు ఆశ పడి నరికేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో అంతమంది అధికారులు ఉన్నా ప్రయోజనం శూన్యం. ప్రభుత్వం వృక్షాలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ప్రకటనలు చేస్తుంటే అధికారులు మాత్రం కనీసం తనిఖీలు కూడా చేయడం లేదు. జిల్లా అధికారులు పుల్లలచెరువును తీవ్ర కరువు మండలంగా ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెట్లను నరుకుతూ పోతుంటే పర్యావరణం దెబ్బతిని భూగర్భ జలాలు అడుగంటిపోయి చుక్క నీరు దొరకని పరిస్థితి దగ్గరలోనే ఉంది. వాల్టా చట్టానికి పదును పెట్టి పర్యావరణాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

చెట్లను నరకడం ఆపాలి:

పుల్లలచెరువు ప్రాంతంలో ఇటీవల చెట్లు నరకడం ఎక్కువైంది. చెట్లు లేకపోతే పర్యావరణం దెబ్బతినే పరిస్థితి ఉన్నా స్థానికంగా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు పట్టించుకోకపోతే ఈ ప్రాంతంలో చెట్లను వెతుకులాడుకోవాల్సి రావడం ఖాయం. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమంగా అనుమతి లేకుండా చెట్లు నరుకుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

– కె.వెంకటేశ్వర్లు, రైతు, పుల్లలచెరువు

చెత్త సంపద కేంద్రాల పరిశీలన



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీఓ పద్మ

తాళ్లూరు: మండలంలోని తాళ్లూరు, మాధవరం గ్రామాల్లో శుక్రవారం డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త సంపద కేంద్రాల నిర్వహణ ద్వారా పంచాయతీలకు ఆదాయ వనరులు వచ్చేలా చూడాలని కోరారు. ఆమెతో పాటు గ్రామ కార్యదర్శులు ఎ.వెంకటేశ్వర్లు, ఐవీ రమణారెడ్డి ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



నేలకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురు రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభం శిథిలావస్థలో ఉంది. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గ్రామ సచివాలయానికి వెళ్లే దారిలో రోడ్డు వెంబడి ఉన్న ముళ్లచెట్లపై విద్యుత్ తీగలు పడి ఉన్నాయి. పశువులను పొలాలకు తోలుకుని వెళ్లే సమయంలో గేదెలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే సంబంధించిన అధికారులు స్పందించి తీగలను సరి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను గ్రామ ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న ఎంఈవో ఆంజనేయులు

యర్రగొండపాలెం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతిలో చేరిన చిన్నారులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో పి.ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో ఏర్పడే భావనలే వారి జీవితంపై ప్రభావితం చూపుతాయన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు మనోధైర్యం నింపుతూ పాఠశాల అంటే భయం లేకుండా చేయాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో పాఠశాలలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో-2 మల్లా నాయక్, ఆయా పాఠశాలల హెడ్మాష్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముండ్లమూరు (దర్శి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎం.శ్రీదేవి సూచించారు. శుక్రవారం పెద్ద ఉల్లగల్లు, కెల్లంపల్లి, శంకరాపురం గ్రామ పంచాయతీలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు పంపించాలన్నారు. డోర్ టు డోర్ గార్బేజి కలెక్షన్ రోజూ అన్ని గ్రామ పంచాయతీల్లో విధిగా నిర్వహించాలని ఆదేశించారు. ఐవీఆర్ఎస్ గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన శంకరాపురం, కెల్లంపల్లి గ్రామ పంచాయతీల ప్రజలకు ప్రత్యేకంగా గవర్నమెంట్ నుంచి ఫోన్ వస్తోందని, వారు వివరాలు తెలుసుకుంటున్నారని, ఎటువంటి నెగిటివ్ సమాధానాలు రాకుండా పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా చెత్తకుప్పలు ఉండరాదని, అలాంటి చెత్తకుప్పలు ఉంటే వాటిని వెంటనే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు తరలిస్తామని తెలిపారు. పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కెల్లంపల్లి, పెద్ద ఉల్లగల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎరువులు కొనుగోలు చేస్తే బిల్లు ఇవ్వాలి



ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏఓ సంపత్‌కుమార్

కురిచేడు: విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ షాపుల యజమానులను ఆదేశించారు. కురిచేడులోని విత్తన, ఎరువుల దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. మోహన్ ట్రేడర్స్, శ్రీ మహాలక్ష్మి ఏజెన్సీస్, కోట వెంకట సుబ్రహ్మణ్యం దుకాణాల్లో విత్తన నిల్వలు, లైసెన్సులు, బిల్లులు, రిజిస్టర్లు, కంపెనీ ఇన్ వాయిస్‌లు పరిశీలించారు. సజ్జ, కంది, పెసర విత్తనాల నమూనాలను సేకరించి మొలకశాతం, తేమ శాతం, నాణ్యత కోసం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు కీలక సూచనలు చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో రైతులు కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని, తీసుకున్న రసీదులు జాగ్రత్తగా పంటకాలం పూర్తయ్యేంత వరకు ఉంచుకోవాలని సూచించారు. డీలర్లు బిల్లులు ఇవ్వకుండా విత్తనాలు విక్రయిస్తే మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాలని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించి సరైన లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేసే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వీఏఏలు వెంకటేష్, నవీన్ ఉన్నారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి



గొర్రెలను పరిశీలిస్తున్న నాగుల్‌మీరా

పుల్లలచెరువు: ప్రస్తుతం పశువుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పశుపోషకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి నాగుల్‌మీరా తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని గొర్రెలు, మేకలను పరిశీలించారు. వాటికి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చెదురు ముదురు వర్షాలు పడుతున్నందున గొర్రెలు, మేకల్లో కాలిపుండు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు, సూచనలు తీసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నాగుల్‌మీరా కోరారు.

వసతి గృహాల్లో అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

దర్శి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని దళిత సేన నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏఎస్‌డబ్ల్యూఓ ఆదిలక్ష్మికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ వసతి గృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు మౌలిక సదుపాయాలతో పాటు దర్శి బాలికల వసతిగృహంలో ఆగిపోయిన పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గంథం ఇర్మియా, పోతవరం మాజీ సర్పంచ్ కోట నాగేంద్రం పాల్గొన్నారు.

ఘనంగా కొణిజేటి రోశయ్య జయంతి



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

యర్రగొండపాలెం: మాజీ గవర్నర్, సమైక్య ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి నాయకులు నివాళులర్పించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘానికి చెందిన నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.అరుణాబాయి, ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ మందుల ఆదిశేషు, వివిధ విభాగాల నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు మూర్తిరెడ్డి, సయ్యద్ జబీవుల్లా, సింగా ప్రసాద్, పి.రాములు నాయక్, కె.వెంకటేశ్వరరెడ్డి, మేడగం వెంకటరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, కందుల నాగార్జునరెడ్డి, కె.రామిరెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు యక్కలి భాగ్యరావు, కాకుమాను సురేష్, పరిమి శేఖర్, సూరె వెంకటస్వామి, గోళ్ల శ్రీరాములు, ఆంజనేయులు, జి.మల్లి, జి.వెంకటనారాయణ, చీదెళ్ల బ్రహ్మయ్య, దోగిపర్తి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



అల్లూరికి నివాళులర్పిస్తున్న శాస్త్రవేత్తలు

దర్శి: స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం దర్శి ప్రధాన శాస్త్రవేత్త సంధ్యారాణి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. వ్యవసాయ పరిశోధన స్థానంలో జయంతి సభ ఏర్పాటు చేశారు. సంధ్యారాణి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు దేశం కోసం చేసిన సేవ, త్యాగనిరతి అందరికీ ఆదర్శప్రాయం కావాలన్నారు. అతి చిన్న వయసులోనే ప్రజల కోసం, ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనుల కోసం పోరాటం సాగించాడని గుర్తు చేశారు. ఆనాటి తెల్ల దొరలకు తన గుండెను అడ్డు పెట్టి వారి అన్యాయాలను అడుగడుగునా అడ్డుకున్నారని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి ఆదర్శప్రాయమని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ సుమన్‌లు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను వివరించారు. రీసెర్చ్ అసోసియేట్ హరిత, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చిన్న షహదత్



ఇండ్లచెరువులో ముస్తాబైన పీర్లు

దొనకొండ: హజరత్ ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు అత్యంత పవిత్రంగా నిర్వహించుకునే మొహర్రం పర్వదినం సందర్భంగా శుక్రవారం చిన్న షహదత్‌కు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మొహర్రం పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. భక్తులు పీర్లను సందర్శించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా ఈద్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ఇండ్లచెరువు, చందవరం, కొచ్చెర్లకోట, నరసింహానాయునిపాలెం, మల్లంపేట గ్రామాల్లో పీర్లను ముస్తాబు చేశారు. శనివారం, ఆదివారం పెద్ద షహదత్ నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఐక్యంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పీర్ల ఉత్సవానికి హోమ గుండాలు సిద్ధం చేస్తున్నారు. రాత్రికి యువకులు ఉత్సాహంగా గులాములు చల్లుకుంటూ మేళ తాళాలతో పీర్లకు చిన్న షహదత్ నిర్వహిస్తారు.

ప్రజాసేవ చేసే అవకాశం అదృష్టం



సన్మాన సభలో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

తర్లుపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం గొప్ప విషయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని గొల్లపల్లిలో పోస్టుమాస్టర్‌గా పని చేస్తూ శుక్రవారం పదవీ విరమణ పొందిన యక్కంటి చెన్నారెడ్డిని ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ.. చెన్నారెడ్డి శేషజీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ రామిరెడ్డి, ఎంపీటీసీ రమేష్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, వైఎస్సార్ సీపీ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, పార్టీ నాయకులు గాయం శ్రీనివాసరెడ్డి, శేషయ్య, మేకల జనార్దన్, భాస్కర్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిపో ఆవరణలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



మార్కాపురం డిపో వద్ద ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక డిపో ఆవరణలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు చక్రపాణియాదవ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీయే స్వయంగా కొనుగోలు చేయాలన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు, డబుల్ డ్యూటీలు చేసే సిబ్బందికి ఇచ్చే డీడీ అమౌంట్ పెంచాలని, రిటైరైన ఉద్యోగులకు గ్రాడ్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను తక్షణమే చెల్లించాలని, పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు రెండు రోజులపాటుగా ఎర్ర బ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్‌కు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బత్తుల తిరుపతయ్య, జాఫర్, షేక్.బాషా, కొండారెడ్డి, బీఎస్ రెడ్డి, నాయక్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మార్కాపురంలో ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

మార్కాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎస్‌వీఎస్ శాస్త్రి, సయ్యద్ బాషా హుస్సేన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులందరికీ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని కోరారు. ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దనరావు, శేఖర్‌నాయుడు, వెంకటేశ్వర్లు, నానీ, ఏడీసీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీవారి ఆలయ వార్షికోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకుడు విజయ్‌కాంత్‌శర్మ, నిర్వాహకులు పాతకోట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ, సాయంత్రం స్వామివారి రథోత్సవం, కోలాట ప్రదర్శన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

డ్రైనేజీ కాలువ ఏర్పాటు

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడులో అంతర్గత సీసీ రోడ్డు మురికికూపంగా మారడంతో ఎంపీడీఓ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రంగస్వామి చర్యలు తీసుకున్నారు. డ్రైనేజీ కాలువ లేకపోవడంతో వర్షం, గృహాల నుంచి వచ్చే మురికినీరు రోడ్డుపై చేరి నిల్వ ఉంటోంది.

పరిస్థితిని గమనించిన ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు రోడ్డుకు ఒకవైపు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో జేసీబీతో తాత్కాలికంగా కచ్చా డ్రైనేజీ తవ్వించారు.

శాకంబరిగా జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: స్థానిక మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో జగదాంబ అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 9వరోజు శుక్రవారం అమ్మవారికి ఆలయ అర్చకులు ఆంజనేయ ప్రసాద్, వరుణ్‌తేజ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.